క్లుప్తంగా

న్యాయ విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: దేశంలో తక్కువ సంఖ్యలో ఉన్న తరగతుల వారిని మైనారిటీలుగా పరిగణిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్ బాబు అన్నారు. స్థానికంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం 1992లోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మత, భాష, సంస్కృతుల ఆధారంగా మైనారిటీల పట్ల వివక్ష చూపించడం తగదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మైనారిటీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య తరగతులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆంధ్ర యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో దూరవిద్య వారాంతపు తరగతులు డిసెంబర్ 21 నుంచి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ డాక్టర్ రామచంద్ర ఆర్కే, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కె.దుర్గారావు పేర్కొన్నారు. బీఏ, బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వారాంతపు తరగతులు ఈ నెల 21, 22, 28, 29 తేదీల్లో, 2025వ సంవత్సరం జనవరి 11, 12, 18, 19, 25, 26 తేదీలలో ఉంటాయని ఆయన తెలిపారు.

లైంగిక వేధింపులపై అవగాహన

కంబాలచెరువు: బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు అనే అంశంపై అవగాహన సదస్సును ఆర్ట్స్ కళాశాల మహిళా సాధికారత విభాగం, జిల్లా మహిళా శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఆనం కళాక్షేత్రంలో నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ అభివృద్ధి శాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇటీవల సంయుక్తంగా తలపెట్టిన నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయీ చేతన 3.0 అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, వాటి పరిణామాలు, బాలికలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నంబర్లపై జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ వివరించారు. బాలికలు లైంగికంగా వేధింపులకు గురైనప్పుడు 112 1098 నంబర్లను సంప్రదించాలన్నారు. కళాశాల మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి.సురేఖ, బాలికల వసతి గృహ వార్డెన్ డాక్టర్ భవాని, టీం సభ్యులు, విద్యార్థినులు, మహిళా శిశు సంక్షేమ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.


వలస కార్మికుల దినోత్సవం

ప్రకాశం నగర్: పారా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గోదావరి గట్టు వద్ద ఉన్న వైఎంవీఏ ఫంక్షన్ హాల్‌లో వలస కార్మికుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు, సామాజిక సేవా సంస్థలు, ఆది నన్నయ కవి యూనివర్సిటీ ఎమ్మెస్‌డబ్ల్యూ విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వల్లి, క్రైం సీఐ రాంబాబు, పారా సంస్థ డైరెక్టర్ థామస్ పల్లితనంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికులు ఉపాధి కోసం వేరే రాష్ట్రాలకు వలస వచ్చి ఫ్యాక్టరీల్లో ఇటుక బట్టీల్లో, బిల్డింగ్ నిర్మాణ పనులు, హోటళ్లలో పనిచేసి వారు తిరిగి ఇతర రాష్ట్రాలకి వెళ్లేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

ఆత్మీయులుగా ఉందాం..

సీటీఆర్ఐ: మనమంతా ఒకే కుటుంబంలా ఆత్మీయుల్లా ఉందామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక జేఎన్ రోడ్డులోని ప్రభు తోటలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలన్నారు. తాను కూడా ఒక బలహీన వర్గానికి చెందిన వాడినేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణేశ్వరరావు, తిలక్‌కుమార్, నయనాల కృష్ణారావు, డాక్టర్ కోమలి, ఎండీ అబ్దుల్లా పాల్గొన్నారు.

తనిష్క్ జ్యూయలరీ షోరూమ్ ప్రారంభం



తనిష్క్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నాణ్యతకు, మన్నికకు ఆధునాతన వెరైటీల బంగారు, వజ్రాభరణాలకు పేరెన్నికగల టాటా ఉత్పాదకత గల తనిష్క్ షోరూమ్‌ను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. స్థానిక తిలక్ రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన షోరూమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఇప్పటి వరకూ పుష్కరఘాట్‌లో ఉన్న ఈ షోరూమ్‌ను తిలక్‌రోడ్‌లో మూడు అంతస్తుల భవనంలో పునః ప్రారంభించారు. నేటి తరం మహిళలు కోరుకునే అన్ని రకాల బంగారు, వజ్రాభరణాలను ప్రత్యేక మోడల్స్‌లో అందుబాటులో ఉంచినట్లు తనిష్క్ షోరూమ్ అధినేతలు గోలి రామారావు, గోలి జానకీ నందన్ తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చెత్త ముందర.. చిందర వందర

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు వచ్చేనా?
- కొండలా పేరుకుపోతున్న చెత్త
- అధికారుల పర్యవేక్షణ శూన్యం



48వ డివిజన్‌లో రోడ్డు చెంతనే పేరుకుపోయిన చెత్త



44వ డివిజన్‌లో భారీ చెత్తకుప్ప

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం.. జిల్లా కేంద్రం. అలాంటి నగరంలో చెత్త సమస్య తిష్ట వేసింది.. అధికారులు, పాలకుల తీరును ప్రశ్నిస్తోంది.. వచ్చే ఏడాది జనవరిలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు నగరాన్ని పరిశీలించడానికి రానున్నాయి. ఇటువంటి తరుణంలో నగరం శుభ్రంగా ఉంచేలా చూసే బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులది. కానీ సమన్వయ లోపంతో చెత్త సమస్య వెక్కిరిస్తోంది. ఎటూ చూసినా కొండలా చెత్త కనిపిస్తోంది. ప్రతి వీధి మలుపు చెత్త డంపింగ్ కేంద్రంగా దర్శనమిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణలో ఉత్తమ ర్యాంకు నగరానికి వచ్చే సూచనలు దాదాపు కనిపించడం లేదు. ఉత్తమ ర్యాంకు వస్తే నగరానికి నిధులు విరివిగా వస్తాయి. కానీ అధికారులు ఆ దిశగా ముందుకు సాగడం లేదు. కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలకు మాత్రమే పరిమితం అవుతున్నారనే విమర్శలు ఎదురవుతున్నాయి.

కొద్ది రోజుల్లో పరిశీలన

కొద్ది రోజుల్లో నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు నగరానికి పరిశీలనకు రానున్నాయి. అందుకు అనుగుణంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉంది. కానీ ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. మొన్నటి వరకూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అందుకే నగర సుందరీకరణ పనులు చేపట్టలేమని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పుడు రహదారులపై గుంతలను నామమాత్రంగా పూడ్చిస్తున్నారు. కానీ పారిశుధ్యంపై దృష్టి పెట్టకపోవడం విచారకరం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పర్యటించే బృందం పలు అంశాలకు మార్కులు వేస్తోంది. తద్వారా ర్యాంకులు ప్రకటిస్తుంది. అందులో ప్రధాన అంశం పారిశుధ్యం. కానీ ఎందుకో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు.

గతమెంతో ఘనం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2019 సంవత్సరంలో 78వ ర్యాంకు రాగా, 2020లో 51వ ర్యాంకు, 2021లో అత్యుత్తమ ర్యాంకు 41 రాగా, 2022లో 97, 2023లో 89వ ర్యాంకులు వచ్చాయి. కానీ 2024లో వీటికి దగ్గరలో కూడా ర్యాంకులు వచ్చే అవకాశం కనిపించడం లేదని వాదన వినిపిస్తోంది.

ఎక్కడ చూసినా చెత్త

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. ఎక్కడ చూసినా చెత్త కనపడుతుంది. చెత్తాచెదారంతో నగరం మురికి కూపంలా మారిపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం వెరసి ప్రజలకు రోగాలు తెచ్చిపెడుతున్నాయి. నగరంలో 1,150 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. ఇందులో 450 మంది పర్మినెంట్ ఉద్యోగులు కాగా, మిగిలిన వారు అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. చెత్త తరలించే వాహనాలు కార్పొరేషన్‌కు చెందినవి 19 ఉన్నాయి. 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 80 చెత్త తరలించే వాహనాలను కార్పొరేషన్‌కు అందజేసింది. చెత్త ద్వారా వచ్చిన పన్నుతో నెలకు రూ.40 లక్షలు వాహనాలు, డ్రైవర్లు, ఇంధనానికి కార్పొరేషన్ చెల్లించేది. కానీ కూటమి ప్రభుత్వం చెత్తపై పన్ను రద్దు చేసింది. వాహనాలకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కానీ ఆ వాహనాలు, డ్రైవర్లకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ వాహనాలు మూలనపడ్డాయి. దీనితో కార్పొరేషన్ 19 వాహనాలతో చెత్తను సేకరిస్తున్నారు. దీనివల్ల నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తుంది.

వీధి మలుపుల్లోనే డంపింగ్

ఉదయం పారిశుధ్య కార్మికులు వచ్చి చెత్తను తొలగిస్తున్నారు. తరువాత ఇళ్లు, ఆఫీసుల్లో పేరుకుపోయిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియక దానిని తీసుకువచ్చి వీధి మలుపుల వద్ద వేస్తున్నారు. మళ్లీ పారిశుధ్య కార్మికులు తిరిగి మరుసటి రోజు వచ్చే వరకూ అక్కడ చెత్త పేరుకుపోతుంది. పెద్ద డంపింగ్ కేంద్రంగా మారుతుంది. వీధిలోని కుక్కలు కుప్పల వద్ద చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో ఆ చెత్త గాలికి కాలువల్లోకి చేరుతుంది. కాలువలో చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు.

ముక్కుమూసుకు వెళ్లాల్సిందే..

నగరంలో చెత్త సమస్యపై నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టి సారించాలి. ఉదయం పూట మాత్రమే చెత్తను తొలగిస్తున్నారు. తిరిగి పేరుకుపోయిన చెత్తను మరుసటి రోజు తీస్తున్నారు. దీంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. వీధిల్లో తిరగలేకపోతున్నాం. ముక్కుమూసుకు వెళ్లాల్సిన దుస్థితి వస్తోంది.

– విజయ్‌కుమార్, స్థానికుడు

శుభ్రంగా ఉంచాలి

నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. సంపూర్ణ పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలి. వీధి మూలల్లో చెత్త డంప్ చేయకుండా వెంటనే తరలించారు. దీనిపై ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలి. అధికారుల నిర్లక్ష్యంతో నగరం అంతా చెత్తకూపంలా మారిపోతుంది. ఇప్పటికైనా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు వచ్చే విధంగా నగరాన్ని శుభ్రంగా ఉంచాలి.

– నాయుడు, స్థానికుడు

వైభవంగా కనకదుర్గమ్మ తీర్థం

కడియం: మండలంలోని వీరవరం- కడియం రోడ్డులోని కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ నెల 22 వరకూ జరిగే ఈ ఉత్సవాలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. తీర్థ మహోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వంటలు వండుకుని, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. కాగా బుధవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకునేందుకు విశేష సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో వీరవరం- కడియం ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌ను మళ్లించారు. దోసాలమ్మ కాలనీ నుంచి కడియపులంక వైపు, దామిరెడ్డిపల్లి వైపునకు వాహనాలను మళ్లించారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



హుకుంపేట సదస్సులో తహసీల్దార్, సర్వేయర్‌లకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: క్షేత్ర స్థాయిలో భూ సమస్యల పరిష్కారానికే గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. బుధవారం ఆమె హుకుంపేట పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సులను ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించి, భూ సంబంధ అంశాలపై అర్జీలను స్వీకరించాలని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో 14 అర్జీలు పరిష్కారానికి వచ్చాయని తహసీల్దార్ జయసూర్యకుమార్ వివరించారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు జిల్లా వ్యాప్తంగా ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారని కలెక్టర్ తెలిపారు. వీటికి శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను గ్రామ స్థాయిలో నిర్వహిస్తూ వాటికి పరిష్కార మార్గం చూపుతుందన్నారు. ఈ సదస్సుల్లో వస్తున్న ప్రతి అర్జీని జీపీఆర్ఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేసి, అధికారులను జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సు సమయంలో రికార్డులు పరిశీలనకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. హుకుంపేట ఎస్‌టీపీ ప్లాంట్ సమీపంలో తమ పేరు మీద 94 సెంట్ల పొలం ఉందని, తాము చిన్నకారు, సన్నకారు రైతులమని పీతల పార్థసారథి, పీతల వెంకటరవీంద్ర అన్నారు. అయితే తమ భూమిలో ఐదు సెంట్లను కలుపుకొని నగరపాలక సంస్థ అధికారులు తమకు ఎటువంటి సమాచారం లేకుండా 40 అడుగుల రోడ్డు నిర్మించారన్నారు. తమకు ఎటువంటి పరిహారం ఇవ్వలేదని, దీనిపై న్యాయం చేయాలని డిప్యూటీ కలెక్టర్ వేదవల్లికి పార్థసారథి, వెంకటరవీంద్రలు అర్జీ దాఖలు చేశారు. అలాగే పలువురు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇంటి సర్వేల గురించి అర్జీలు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, చిత్రంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి

కడియం: మహిళలు సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీఎస్ఎస్ మూర్తి, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య వరప్రసాద్ అన్నారు. కడియం మండల పరిషత్ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కొవ్వొత్తుల తయారీలో శిక్షణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో కొవ్వొత్తుల తయారీలో మెళకువలను వివరించేందుకు కడప నుంచి ప్రత్యేకంగా తీసుకు వచ్చిన ఖాదిర్ బీ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ, ఎంపీపీ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి వివిధ కార్యక్రమాల ద్వారా వారి అవసరమయ్యే శిక్షణనిచ్చి ప్రోత్సహించడానికి రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకరిస్తుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ టి.శ్రీనివాస్, హార్టికల్చర్ హెచ్‌ఓడీ సుధీర్ కుమార్, వెలుగు ఇన్‌చార్జ్ ఏపీఎం ఎం.నాగభూషణం, సీసీలు ఎస్.పద్మారావు, వి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఐడీసీ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గేష్, చిత్రంలో డీఆర్‌డీఏపీడీ మూర్తి

రాజమహేంద్రవరం రూరల్: మహిళా సంఘాల బలోపేతానికి పారిశ్రామిక రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై కనీస అవగాహన అవసరమని జిల్లా గ్రామీణాభివృద్ధి, సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. బుధవారం హుకుంపేటలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులు, మండల సమాఖ్య ప్రతినిధులతో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ వ్యవసాయం, మత్స్య, హార్టికల్చర్, సూక్ష్మ నీటి పారుదల, పశు సంవర్ధక, సిడ్బి శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల వివరాలు, రుణాలు.. రాయితీల గురించి వివరించారు. వీటిని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ముఖ్యమన్నారు. సూక్ష్మనీటి పారుదల శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.దుర్గేష్ మాట్లాడుతూ సూక్ష్మ ఆహార పరిశ్రమల అభివృద్ధి కోసం 35 శాతం రాయితీ అందిస్తున్నారన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కలెక్షన్ సెంటర్‌లు, కోల్డ్ రూమ్‌ల కోసం 35 శాతం రాయితీ గరిష్టంగా రూ.11,25,00 అందిస్తున్నారన్నారు. వ్యవసాయాధికారి సీహెచ్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు 50 రాయితీపై విత్తనాలు ఇస్తారన్నారు. మత్స్యశాఖ ఏడీ ఎస్‌కే దిశ మాట్లాడుతూ అలంకరణ చేపలు యూనిట్‌కు రూ 3,00,000 రుణానికి 60 రాయితీ, ద్విచక్ర వాహనం ఐస్ బాక్స్ యూనిట్ ధర రూ.75,000ను ఎస్టీ, ఎస్సీలకు, మహిళలకు రాయితీపై ఇస్తారన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గోకులం స్కీమ్‌లో పశువులు ఉండాలని, సొంత స్థలం కలిగి, 5 ఎకరాలు లోపు ఉన్నవారు అర్హులన్నారు . హార్టికల్చర్ అధికారి డి.సుధీర్ కుమార్, సిడ్బి ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, 18 మండల సమాఖ్య అధ్యక్షులు, సెర్ప్ సిబ్బంది హేమంత్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన స్పోర్ట్స్ మీట్



ఆర్ట్స్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ఏ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్ రెండో రోజు బుధవారం కొనసాగింది. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌ను ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, జీఎంఆర్ జనరల్ సెక్షన్ హెడ్ ఎంపీఎస్ మురళీకృష్ణ, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ గంగాధరరావు, జిల్లా పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీడి ప్రసాద్, ఎస్.నాగరాజు, కోశాధికారి ఎస్.వీరబాబు తదితరులు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి పీడీ కె.నరసింహారావు విజేతలను ప్రకటించారు. అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో పి.చరిత్‌శ్రీగుప్తా (ఆదిత్య) ప్రథమ, డి.చిరంజీవి (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) ద్వితీయ, కె.షణ్ముఖరావు (గైట్) తృతీయ, 200 మీటర్లలో జి.అవినాష్‌కుమార్ (ఆదిత్య) ప్రథమ, పి.చరిత్‌శ్రీగుప్తా (ఆదిత్య) ద్వితీయ, జి.దిలీప్ (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) తృతీయ, 400 మీటర్లలో జి.అవినాష్‌కుమార్ (ఆదిత్య) ప్రథమ, సీహెచ్ ప్రవీణ్ కుమార్ (జీఎంఆర్, ఎటపాక) ద్వితీయ, జి.దిలీప్ తృతీయ, 800 మీటర్లలో పి.తిరుపతి (జీఎంఆర్, ఎటపాక) ప్రథమ, కె.నరేంద్ర (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) ద్వితీయ, ఎ.శివశంకర్ (ఆదిత్య) తృతీయ, 1500 మీటర్లలో కె.నరేంద్ర (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) ప్రథమ, ఎ.శివశంకర్ (ఆదిత్య) ద్వితీయ, కె.మణికంఠ (ఏపీటీ, కేకేడీ) తృతీయ, లాంగ్‌జంప్‌లో వి.లక్ష్మీపతి (జీఎంఆర్, ఎటపాక) ప్రథమ, జి.శివ(బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) ద్వితీయ, పి.వివేక్ (గైట్) తృతీయ, హైజంప్‌లో ఎం.చక్రి (గైట్) ప్రథమ, బి.హరీష్ (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) ద్వితీయ, ఆర్.ప్రసాద్ (గైట్) తృతీయ, ట్రిపుల్ జంప్‌లో బి.హరీష్ (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) ప్రథమ, కె.వెంకటతేజ (ఆదిత్య) ద్వితీయ, వై.నవీన్ (బీఆర్ఏజీఎంఆర్, ఆర్‌జేవై) తృతీయ, షాట్‌పుట్‌లో కె.సాంబశివరావు (ఆదిత్య) ప్రథమ, జి.రమణబాబు (గైట్) ద్వితీయ, కె.తరుణ్ (ఏపీటీ, కేకేడీ) తృతీయ, డిస్కస్‌త్రోలో కె.సాంబశివరావు (ఆదిత్య) ప్రథమ, బి.గిద్యోన్ (ఏపీటీ, కేకేడీ) ద్వితీయ, ఏడీఎస్ఎస్ గౌతమ్ (గైట్) తృతీయ, జావెలిన్‌త్రోలో ఎస్.చరణ్ (జీఎంఆర్, ఎటపాక) ప్రథమ, ఎస్.రమేష్ (ఆదర్శ) ద్వితీయ, జి.ఆకాష్ (ఏపీటీ, కేకేడీ) తృతీయ, 4 ''100మీటర్ల రిలేలో డీఆర్ఏ జీఎంఆర్ (ఆర్‌జేవై) ప్రథమ, గైట్ ద్వితీయ, జీఎంఆర్ (ఎటపాక) తృతీయ, 4''400 రిలేలో ఆదిత్య ప్రథమ, జీఎంఆర్ (ఎటపాక) ద్వితీయ, డీఆర్ఏజీఎంఆర్ (ఆర్‌జేవై) తృతీయ స్థానాలు సాధించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రీజనల్ మీట్ ముగింపు వేడుకలు జరుగుతాయి.

నిధులు మంజూరు చేయండి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో ఉన్న 89 నిరాశ్రయ కేంద్రాలకు నిధులు అందించి ఆదుకోవాలని రాష్ట్ర నిరాశ్రయుల నిర్వహణ ఎన్జీఓల సంఘ ప్రతినిధి, స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాజమహేంద్రవరం వచ్చేసిన ఆయనను మున్సిపల్ కార్యాలయంలో కలసి రాష్ట్ర సంఘం తరఫున వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 89 నిరాశ్రయ కేంద్రాలు 2016లో ప్రారంభించగా, ప్రస్తుతం 59 షెల్టర్లు నిధులు విడుదల కాక రెన్యువల్ చేయక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. 20 నిరాశ్రయ కేంద్రాలు మున్సిపాలిటీల జనరల్ ఫండ్‌తో నడుస్తున్నాయన్నారు. ఈ విషయమై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి నిధులు విడుదలకు తాను కృషి చేస్తానని అన్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున మేనేజర్ కొండలరావు హరి ప్రసాద్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గోదావరి కల్చర్ క్లబ్, రాక సంస్థ సభ్యులు

ధవళేశ్వరం: గోదావరి కల్చర్ క్లబ్, రాక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ప్రముఖ గాయకుడు, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ బుధవారం జరిగింది. దీనికి సంస్థ అధ్యక్షుడు జీవీ రమణ, కార్యాధ్యక్షుడు యరమ్రోతు ధర్మరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, గాలి సుబ్బరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు గాలి సుబ్బరాజు, ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, ఆధ్యాత్మిక వేత్త తోట సుబ్బారావు, శిల్పి కరుణాకర్ వడయార్, ధవళేశ్వరం సీఐ టి.గణేష్, వేగిశెట్టి కోదండ రామారావు తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీవీ రమణ మాట్లాడుతూ గానామృతంతో తెలుగు వారి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని కొనియాడారు. పదహారు భాషల్లో ఏభై వేల పాటలు ఆలపించిన ఏకైక గాయకునిగా చరిత్రకెక్కారన్నారు. యరమ్రోతు ధర్మరాజు మాట్లాడుతూ కేవలం పాటలే కాకుండా సినీ నేపథ్య సంగీతం, నిర్మాతగా, మాతృ భాషాభిమానిగా సంగీత ప్రపంచానికి సేవలందించారన్నారు. గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు గ్రంధి వెంకటరామ జగన్నాథం, తిరుమల కృష్ణమోహన్, పుసులూరి శేషుకుమార్, ముడెడ్ల రమేష్, గాదిరాజు రామరాజు, సావాడ శ్రీనివాసరెడ్డి, ఎం.ఏడుకొండలు, నాగభూషణం, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై రెండో బ్యాచ్‌కు శిక్షణా కార్యక్రమం ఈఓపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ 2030 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 9 లక్ష్యాలు, 2047వ సంవత్సరం నాటికి 17 లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. మాస్టర్ ట్రైనీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, అంగనవాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు స్కిల్ హబ్‌లో ఉపాధి శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా కలెక్టరేట్‌లో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ (నేక్) భవనంలో రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ స్కిల్ హబ్‌లో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేక్ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ జిన్నూరి రాజు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎన్.రాజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు ఔత్సాహిక యువతకు, 'హెల్పర్ ఎలక్ట్రీషియన్' వృత్తి శిక్షణ ద్వారా, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు. నిర్ణీత వేళలో బోధనతో శిక్షణ కార్యక్రమం రెండు నెలలకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ప్రవేశానికి చదవడం, రాయడం సామర్థ్యత గలవారు అర్హులన్నారు. ఇందులో ప్రవేశం కోరే అభ్యర్థులు తమ పేర్ల నమోదుకు 98664 43303, 91339 12947 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ



కిక్ బాక్సింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థినులు

ప్రకాశంనగర్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ ఫర్ వుమెన్ కిక్ బాక్సింగ్ టీం సెలక్షన్ కం చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో ఎనిమిది మంది పాల్గొనగా ఐదుగురు విద్యార్థులు స్వర్ణ, ఇద్దరు వెండి, ఒక్కరు కాంస్య పతకాలను సాధించినట్టు వెల్లడించారు. విజేతలను వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమార్, కోచ్ ఎం.భవానీ శంకర్, కళాశాల పీడీ వై.సుధారాణి, నాగు తదితరులు అభినందించారు.

ఓపెన్ ఫోరమ్ ద్వారా సమస్యల పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు రుడా పరిధిలో ఎవరైనా భవన నిర్మాణ (బిల్డింగ్ ప్లాన్), ల్యాండ్ డెవలప్‌మెంట్ (లే అవుట్) కోసం అర్జీలు దాఖలు చేసినవారు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యల పరిష్కారం ప్రతి శుక్రవారం నిర్వహించే ఓపెన్ ఫోరానికి తగిన పత్రాలతో హాజరు కావాలని రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవనం ప్లాన్, ల్యాండ్ అభివృద్ధికి చెందిన వివరాలతో ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రుడా కార్యాలయంలో నిర్వహించే ఓపెన్ ఫోరమ్‌కు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

కూర్మావతారంలో జనార్దనుడు



కూర్మావతారంలో ధవళగిరి లక్ష్మీజనార్దనస్వామి

ధవళేశ్వరం: ధనుర్మాసం సందర్భంగా నవజనార్దనుల్లో ప్రథముడైన ధవళేశ్వరం శ్రీలక్ష్మీ జనార్దనస్వామి వారిని బుధవారం కూర్మావతారంలో అలంకరించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు (కాసులు), పవన్‌కుమార్ ఏర్పాట్లు చేశారు.